శాస్త్రీయ కళలను కాపాడుకోవాలి



కళాకారులతో ఆర్.కృష్ణయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ కళలను కాపాడుకోవాలని రాజ్యసభ్య సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో నృత్య మాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీల సంయుకత్త ఆధ్వర్యంలో మ్యూజిక్ ఫెస్ట్–2025 వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..విద్యతో పాటు సాంస్కృతిక క్రీడా రంగాల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. చక్కటి హావాభావాలతో నృత్యం చేసిన చిన్నారులను అభినందించారు. అనంతరం నాట్య గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, సంస్థ నిర్వాహకులు వీరేష్‌యాదవ్, డాక్టర్ ఎం.ఏకవీర తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గోల్కొండ: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం నేడు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపారు. గోల్కొండ రేతిగల్లిలోని జీఎంకే ఫ్రైడ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని ఆయన తెలిపారు. యువకులు ముందుకువచ్చి రక్తాన్ని దానం చేయాలని కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను సన్మానిస్తున్న రాజ్ నారాయణ ముదిరాజ్ తదితరులు

చార్మినార్: యువత విద్య క్రీడల్లో రాణించినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అన్నారు. ఆదివారం పాతబస్తీ పూల్‌బాగ్ చమన్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో ఇటీవల జయశంకర్ మున్సిపల్ ప్లే గ్రౌండ్ సికింద్రాబాద్‌లో జరిగిన జాతీయ బాక్సింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన భవాని, బ్రాంజ్ మెడల్ సాధించిన హెచ్.అభికి ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలు ఆడడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చునన్నారు. ఈనెల 19న ఉత్తరప్రదేశ్‌లో జరిగే నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 7వ, యూత్ అండర్ 19 మెన్ అండ్ ఉమెన్ పోటీలకు భవానికి ఎన్నికయ్యారని పూల్‌బాగ్ చమన్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్స్ బాక్సింగ్ కోచ్‌లు ప్రతాప్ ప్రదీప్, మహర్షి శశి తెలిపారు. ఈ కార్యక్రమంలో పూల్‌బాగ్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్ క్రీడాకారులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు ఎస్.సురేందర్, గిరీష్ రంగరాజు ప్రభు, తీగల నరేందర్ రెడ్డి, ఆంజనేయులుచారి పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప విషుపూజ

గౌలిపురా: శ్రీరాంనగర్ కాలనీలో అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మణికంఠ పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విషుపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటలకు గణపతి హోమం, 6.30 గంటలకు అయ్యప్ప స్వామి అభిషేకం, 10.30 గంటలకు దీపారాధన, మధ్యాహ్నం ఒంటి గంటకు పడి హారతి, 1.30 గంటలకు అన్న ప్రసాదం, శరణ కీర్తన భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు.

స్వరకర్త ‘ఉషాకాంత్’కు నివాళి



బంజారాహిల్స్: స్వరమే ఆయుధంగా, సాహిత్యమే సాధనగా, సంగీతమే జీవనసారంగా గడిపిన ఉషాకాంత్ గొప్ప సంగీతకారుడని పలువురు కొనియాడారు. మహతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని అలా లిబర్టీలో ఉషాకాంత్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉషాకాంత్ పాటలు తరతరాల కళాకారులను నడిపిస్తూనే ఉంటాయన్నారు. ఉషాకాంత్ కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉషాకాంత్ సంగీత మేధావి అన్నారు. ఆయన ఎన్నో ప్రైవేట్ పాటలు పాడారన్నారు. మ్యూజిక్ కంపోజ్ చేశారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ ముందున్న కర్తవ్యమన్నారు. ‘పంచమ్’ అనే సాంస్కృతిక సంస్థను స్థాపించి ఎనలేని సేవలందించారన్నారు. 1970ల ప్రారంభంలోనే ఆయన అనేక సంగీత ప్రదర్శనలు ఇచ్చారన్నారు.

నాలా పనులు పూర్తయ్యేదెన్నడో?

- రెండు నెలలుగా మూతపడ్డ పాత ముంబాయి జాతీయ రహదారి
- ఐదు నెలలైనా ప్రధాన రహదారిపై పూర్తికాని నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు



నత్తనడకన సాగుతున్న గోషామహల్ నాలా నిర్మాణ పనులు

అబిడ్స్: గోషామహల్ నాలా నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండంతో స్థానికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత ముంబాయ్ జాతీయ రహదారి అయిన గోషామహల్ నుంచి చందన్‌వాడి వెళ్లే నాలా కుప్పకూలి ఐదు నెలలు కావస్తున్నా పూర్తిచేసే నాథుడే లేడు. గత ఐదు నెలల్లో అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల వైఫల్యంతో నాలుగు సారు మధ్య మధ్యలో నాలా పైకప్పు కూలిపోంది. అంతేకాక ఒకసారి విద్యుత్ స్తంభాలు, మరోసారి జీహెచ్‌ఎంసీ వాహనం కూడా నాలాలో పడిపోయింది. ఇలా పలుసార్లు నాలా పనులకు అంతరాయం ఏర్పడుతున్నా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కానీ, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు కానీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు. జీహెచ్‌ఎంఈ కమిషనర్ ఒక్కసారి కూడా పర్యటించి నాలా పనులను పర్యవేక్షించకపోవడంతో స్థానిక వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

మూసివేసిన గోషామహల్ పాత ముంబాయి రహదారి..

రెండు నెలలుగా గోషామహల్ నాలా నిర్మాణ పనులతో పాత ముంబాయి గోషామహల్ జాతీయ రహదారిని అధికారులు మూసివేశారు. వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఈ ప్రధాన రోడ్డుపై రాకపోకలు సాగకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. నాలా పనులు వేగంగా చేపట్టడంలో జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ ఏఈ, డీఈ, ఈఈలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏ మాత్రం పనులు ముందుకు పోయే విధంగా చర్యలు తీసుకోవడం లేదని స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

వ్యాపారులకు తీవ్ర నష్టాలు..

గోషామహల్ ప్రధాన రహదారిని అధికారులు రెండు నెలలుగా మూసివేయడంతో వ్యాపారస్థులకు తీవ్ర నష్టాలు కలుగుతున్నాయి. ఈ గోషామహల్ రహదారి ఇరువైపులా ప్లైవుడ్ దుకాణాలు, టింబర్ మర్చంట్లు హార్డ్‌వేర్ దుకాణాలు వందల కొద్ది ఉన్నాయి. ఈ ప్రధాన రహదారి మూసివేయడం ద్వారా ఈ దుకాణాలకు వ్యాపారులు ఎవ్వరు రావడం లేదు. కొనుగోలు, అమ్మకాలు దాదాపు 70శాతం తగ్గుముఖం పట్టడంతో వందలాది మంది దుకాణాదారులు లక్షల్లో నష్టాలకు గురవుతున్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తాం



గోషామహల్ నాలా పనులు వెంటనే పూర్తి చేయాలి. వ్యాపారులకు గోషామహల్ నియోజకవర్గ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. గోషామహల్ ఇంజినీరింగ్ అధికారులు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఒక్కసారైనా పర్యటించి వేగంగా పనులు పూర్తి చేయాలి. లేనిచో ట్యాంక్‌బండ వద్ద ఉన్న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించి ఆందోన చేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే వ్యాపారులకు కోట్ల రూపాయాల నష్టం వాటిళ్లతుంది.

– ఆనంద్‌కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ వస్తేనే పనులు వేగవంతం



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి గోషామహల్‌కు వచ్చి నాలా పనులను పర్యవేక్షించినప్పుడే 14వ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు గోషామహల్ నాలా పనులను వేగంగా పూర్తి చేస్తారు. ఉన్నతాధికారులు రాకపోవడంతో కిందిస్థాయి ఏఈ, డీఈ, ఈఈలు ఏ మాత్రం స్పందించడం లేదు. ఒక్కసారైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ పర్యటిస్తే స్థానిక అధికారుల్లో చలనం వస్తుంది. స్థానిక ప్రజలు, వ్యాపారులు ప్రతిరోజు నరకం చూపిస్తున్నా జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారుల్లో ఏ మాత్రం చలనం రావడంలేదు.

– ఆల పురుషోత్తమ్‌రావ్, బీజేపీ నాయకుడు

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..



గోషామహల్ నాలా పనులు ఐదు నెలలు కావస్తున్నా పూర్తి కాకపోవడంతో వ్యాపారస్తులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పనులు వేగవంతం కావడం లేదు. వ్యాపారులు లక్షల్లో నష్టపోతున్నా పట్టించుకునే నాథుడే లేడు. జీహెచ్‌ఎంసీ ప్రధాన రహదారిని మూసివేయడంతో వ్యాపారాలు ఎలా సాగుతాయి. నెల రోజుల్లో అయ్యే నిర్మాణ పనులను ఐదు నెలలు కావస్తున్నా పూర్తి చేయడం లేదు. వెంటనే పనులు పూర్తి చేసి వ్యాపారులకు న్యాయం జరిగేలా కృషి చేయాలి. లేనిచో వందలాది మంది వ్యాపారస్తులు కలిసి ఆందోళన చేస్తాం.

– సురేష్ ముదిరాజ్, స్థానిక వ్యాపారి

సమాజ సేవలో యువకులు ముందుండాలి



ఆత్మీయ సమ్మేళనంలో శ్రీకాంత్‌చారి, మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: సమాజ సేవలో యువకులు ముందుండాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆదివారం టోలిచౌకి టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 ఏళ్లుగా తాము తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్, పీస్ ఫోర్స్ కమిటీల ద్వారా దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారికి సేవలు అందిస్తున్నామన్నారు. పదేళ్లుగా బి.శ్రీకాంత్‌చారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, నాగన్న, శ్రీనివాస్, ఎంజేపీ డైరీ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ తదితరులున్నారు.

‘వక్ఫ్ సవరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం’



నిరసన వ్యక్తం చేస్తున్న ఆసీఫ్ హుస్సేన్ సోహెల్

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం ఏమాత్రం సమర్థనీయం కాదని దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఆసీఫ్ హుస్సేన్ సోహెల్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఆయన ఆధ్వర్యంలో ఆదివారం టోలిచౌకి సూర్య నగర్ కాలనీలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారత ముస్లింలపై ప్రధాని మోదీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను ఈ చట్ట సవరణ స్పష్టం చేస్తుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో ఉన్న విషయాలను మోదీ ప్రభుత్వం ఒకొక్కటిగా ప్రవేశపెడుతుందన్నారు. ఈ చట్ట సవరణను ఉపసంహరించుకునేంత వరకు తాము పోరాటం చేస్తామన్నారు.

దిగ్విజయంగా సంపూర్ణ శతావధానం



శతావధానం ప్రారంభోత్సవం

నాంపల్లి: డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానం రెండో రోజు నాంపల్లిలోని డాక్టర్ నందమూరి తారక రామారావు కళా మందిరంలో దిగ్విజయంగా కొనసాగింది. తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజా–పద్యం, అవధాన విద్యా వికాస పరిషత్ సంస్థల సంయుక్త నిర్వహణలో నడుస్తున్న శతావధాన కార్యక్రమంలో రెండో రోజు మొదటి సమావేశం డాక్టర్ సంగనభట్ల నర్సయ్య అధ్యక్షతన ప్రారంభమైంది. ప్రముఖ శతావధాని డాక్టర్ ఆముదాల మురళి సంచాలకత్వ బాధ్యత వహించారు. శతావధానంలో 25 సమస్యలు, 15 వర్ణనల పూరణలు, ఐదు ఆశువులు పూరించడం జరిగింది. మధ్యాహ్నం జరిగిన సమావేశానికి ప్రముఖ జాతీయ కవి డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా తన శిష్యుడైన అవధానిని ఆశీర్వదించారు. రెండో సమావేశంలో 25 దత్తపదులు, రెండు, మూడు పాదాలు, ఐదు నిషేధాక్షరులు, ఐదు న్యస్తాక్షరులు, రెండో పాదం పూరణ, ఐదు అశువుల పూరణ చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, అవధాన కార్యక్రమ అధ్యక్ష, కార్యదర్శులు నారుమంచి అనంతకృష్ణ శర్మ, డాక్టర్ మరుమాముల దత్తాత్రేయ శర్మ, సభా సంచాలకులు అవుసు భాను ప్రకాష్, అతిథి సత్కార నిర్వాహకులు, కోశాధికారి కేవీఎన్ ఆచార్య సభా కార్యాన్ని సంపన్నంగా నిర్వహింపజేశారు.

సదానంద గుప్తా సేవలు అమోఘం



సదానంద గుప్తాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: సదానంద గుప్తా సేవలు అమోఘమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. సంవత్సరం పొడవునా నిరంతరం పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ సదానంద గుప్తా గొప్ప సమాజ సేవకుడిగా నిలిచిపోయారన్నారు. ఆదివారం సమాజ సేవకులను రాజాసింగ్ ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..30 ఏళ్లుగా ధూల్‌పేట రహీంపురాలో ఉంటున్న సదానంద గుప్తా (నందం) నిత్యం సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ శ్రేయస్సుకు, సమాజ సంక్షేమానికి ఎంతో దోహదపడుతున్నారన్నారు. సదానంద గుప్తా మాట్లాడుతూ.. జీవితాంతం సమాజ సేవాకే అంకితమవుతానన్నారు. ప్రజా సేవా చేస్తూ జీవితం గడుపుతానన్నారు.

‘అధ్యక్ష ఎన్నికను పారదర్శకంగా నిర్వహిస్తాం’

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక నిబంధనల ప్రకారం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో సీక్రెట్ బ్యాలెట్ ప్రక్రియ ద్వారా నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. ఈ అధ్యక్ష ఎన్నికను పూర్తిగా పారదర్శకంగా, జవాబుదారీతనంగా నిర్వహిస్తామని కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ వెల్లడించారు. ఆయన నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ..త్వరలోనే కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవీ ఎన్నిక నిర్వహణకు సంబంధించి ఎన్నికల అధికారిగా నియమిస్తామని, నోటిఫికేషన్ జారీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఓటర్లుగా ఉంటారని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



కమిటీ లెటర్ హెడ్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలను కలిసికట్టుగా విజయవంతం చేయాలని ఆలయ బోనాల నిర్వహణ మాజీ చైర్మన్ సత్యంరెడ్డి అన్నారు. బోనాల నిర్వహణ కోసం జగదాంబిక మహంకాళి టెంపుల్ చీఫ్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు అయింది. ఈ మేరకు నూతన కమిటీ వారు ఆదివారం గోల్కొండ కోటలోని అమ్మవారి ఆలయం వద్ద కొత్త కమిటీ లెటర్ హెడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ బోనాల నిర్వహణతో సుదీర్ఘంగా అనుభవం ఉన్న వారు ఈ కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చీఫ్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడిగా సత్యం రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బాలప్రసాద్ తివారీ, జాయింట్ సెక్రటరీలుగా కె.ఆంజనేయులు, శ్రీధర్‌గౌడ్, పరమేష్ కుమార్, కోశాధికారిగా బొమ్మల శ్రీకాంత్‌చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.జి.రాంబాబుయాదవ్, ఎం.ఆనంద్‌కుమార్, టి.వినీత్‌సింగ్‌లు నియమితులైయ్యారు. ఈ కమిటీకి ప్రధాన సలహాదారులుగా రాజువస్థాద్, ప్రధాన లీగల్ అడ్వైజర్‌గా ఐ.రమేష్‌లు నియమితులయ్యారు.

సందర్శకుల సందడి



చార్మినార్‌లో కిటకిటలాడుతున్న సందర్శకులు

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. వ్యాపారాలు జోరుగా కొనసాగాయి. వరుస సెలవులతో పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలకు పర్యాటకుల రద్దీ పెరిగింది. చార్మినార్, మక్కా మసీద్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్జంగ్ మ్యూజియం తదితర ప్రాంతాల్లో సందర్శకుల సందడి కనిపించింది. తమ కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులతో కలిసి పర్యాటక ప్రాంతాలను సందర్శించిన పర్యాటకులు అక్కడక్కడ సెల్ఫీలు దిగారు. పర్యాటకుల రద్దీ పెరగడంతో యధావిధిగా ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు.


ముస్లింల సంక్షేమానికి వక్ఫ్ యాక్ట్ దోహదం

చార్మినార్: ముస్లింల సంక్షేమానికి వక్ఫ్ యాక్ట్ ఎంతగానో దోహదం చేస్తుందని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. ఆదివారం ఆయన మహారాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ కైసర్ ఖలీద్, ఆదాయ పన్ను అదనపు కమిషనర్ డాక్టర్ వసీం–ఉర్–రెహమాన్‌లతో సమావేశమై వక్ఫ్ అమెండ్మెంట్ యాక్ట్–2025పై చర్చించినట్లు ఆయన తెలిపారు. దేశంలోని మైనారిటీ వర్గాల సంక్షేమంతో పాటు అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదం చేస్తుందన్నారు.



అధికారులతో సమావేశమైన మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

పత్రికలు ఎప్పుడు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

కాలిబండ: భారతదేశం ప్రజాస్వామ్య దేశమని..పటిష్టమైన న్యాయ వ్యవస్థ దేశంలో కొనసాగుతుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మోతీగల్లీలోని ఉర్దూ మస్కాన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పత్రికలు ఎప్పుడు పారదర్శకంగా ఉండాలని.. పక్షపాతంగా ఉండకూదని ఆయన సూచించారు. ప్రతి ఏటా కొత్త పత్రికలు రావడంతో పత్రికల సంఖ్య పెరుగుతుందన్నారు. దీంతో సెన్సేషనల్ వార్తల కోసం ఆత్రుత పడుతున్నారని ఇది సమాజానికి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. జర్నలిస్టులు సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. అరుణ్ శౌరి జర్నలిస్టు పాక్షిక వార్తల వల్ల దేశ ప్రధాని సైతం రాజీనామా చేయాల్సిన అవసరం ఏర్పడిందని ఆయన కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలు తప్పుదోవ పట్టకుండా బృహత్తర బాధ్యత జర్నలిస్టులపైనే ఉంటుందన్నారు. రైతుల సమస్యలను కూడా వెలుగులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. నిర్భయంగా వార్తలు రాసే విలేకర్లకు సంరక్షణతో పాటు ఆరోగ్యానికి విద్య, వైద్యం తదితర సౌకర్యాలకు ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు. ఈ సదస్సులో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు ఉప్పల లక్ష్మణ్, ఎన్‌యుజేఐ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన శివాజీ సర్కార్, టీజేఏ అధ్యక్షులు రమణారావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.ఘూరీ తదితరులు పాల్గొన్నారు.

మిల్క్ డెలివరీ బాయ్‌పై దాడి చేసి బైక్ చోరీ


బంజారాహిల్స్: దారికాసిన ముగ్గురు ఆగంతకులు ఓ మిల్క్ డెలివరీ బాయ్‌ని కర్రలతో కొట్టి బైక్ చోరీ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్ బస్తీకి చెందిన రేపాక సాయికృష్ణ(19) డిగ్రీ చదువుకుంటూనే ప్రతిరోజూ ఉదయం ఇంటింటికీ వెళ్లి పాల ప్యాకెట్లు అందజేస్తుంటాడు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్–14లోని నందినగర్‌లో ఓ ఇంటికి మిల్క్ ప్యాకెట్లు డెలివరీ చేసేందుకు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు యాక్టివాపై వెళ్తున్న సాయికృష్ణను అడ్డగించారు. ముందస్తు పథకం ప్రకారం కర్రలతో సాయికృష్ణపై దాడి చేసి బైక్‌పై అక్కడి నుంచి ఉడాయించారు. ఈ ఘటనలో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు ఆగంతకులు బైక్‌పై వచ్చారని, కొట్టి బైక్ లాక్కొని వెళ్లారని బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పాత నేరస్తులపై కదలికలపై దృష్టి పెట్టారు. బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించాలి

మణికొండ: పండెన్‌వాగు పరీవాహకంగా ఉన్న ఇళ్ల నివాసులకు దుర్వాసనతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, దానికి బాక్స్ డ్రైన్ నిర్మించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ట్రయల్స్ విల్లాస్, పండెన్‌వాగు పరివాహకంలో గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో బాగంగా పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండెన్‌వాగులో నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు పంచవటి కాలనీలోని రోడ్డు నెంబర్ 10 వద్ద ఓ చెక్ డ్యాంను నిర్మించి మురుగునీటిని గతంలో మాదిరిగా షేక్‌పేట వైపు మళ్లించాలన్నారు. ట్రయల్స్ విల్లాస్ ముందు పంచవటి కాలనీతో కనెక్ట్ చేస్తు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఓయూ కాలనీ రోడ్డులో పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్డు వెడల్పు చేసి సమస్యను నివారించాలన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య నాట్యాలయం నర్తనం సంస్థ 2వ వార్షికోత్సవాన్ని ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఆనంద నర్తన గణపతి, ఆలారిప్పు, జతిస్వరం, నటేశ కవత్వం, నటరాజ స్తోత్రం, రావణ స్తోత్రం వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులరాలు సురభివాణీదేవి మాట్లాడతూ..కూచిపూడి, భరతనాట్యం వంటి కళలను ఈ తరానికి అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కోరియోగ్రాఫర్ ఆని మాస్టర్, సినీనటులు ఇంద్రనీల్, మేఘన, కృష్ణవేణి, సంస్థ వ్యవస్థాపకురాలు వర్షిణి తదితరులు పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న కళాకారులు